


కేక్‌కట్ చేస్తున్న రవిచంద్ర, రవీందర్‌రావు, కవిత, శంకర్‌నాయక్

# జన హృదయ నేత హరీశ్‌రావు

- బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర
- ఘనంగా పుట్టిన రోజు వేడుకలు

ఇనుగుర్తి, జూన్ 3 : జన హృదయ నేత సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. మంగళవారం హరీశ్‌రావు పుట్టిన రోజు వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి హరీశ్‌రావు విశేషమైన కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ దుర్గేశ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**మహబూబాబాద్‌లో..**

మహబూబాబాద్ రూరల్, జూన్ 3 : తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పుట్టిన రోజు వేడుకలను పట్టణంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఫరీద్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి చిన్నారులకు పంచిపెట్టారు. కంకరబోర్డ్ కాలనీలోని పేద ముస్లిం విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్ స్వామి, రఫీక్, యాసీన్, సాజిద్, జాకీర్, యాకూబ్, సూర్యప్రకాశ్, శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

**బయ్యారంలో..**

బయ్యారం:మాజీ మంత్రి హరీశ్‌రావు పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం బస్టాండ్ సెంటర్‌లో బీఆర్ఎస్ నాయకులు కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తాత గణేశ్, నాయకులు గంగుల సత్యనారాయణ, ఎనుగుల ఐలయ్య, శివాజీ, సందీప్, యాకయ్య పాల్గొన్నారు.

**దంతాపల్లిలో..**

దంతాలపల్లి : మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదినం సందర్భంగా మండలంలోని పెద్దముప్పారం గ్రామంలోని అంబేద్కర్ సెంటర్‌లో హరీశ్‌రావు యువసేన ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ధర్మరాపు హరీశ్, లింగమల్లు, సందీప్, సోమన్న, రమేశ్, వెంకన్న పాల్గొన్నారు.

## ఉద్యమకారులను ఆదుకోవాలి

నర్సింహులటపే, జూన్ 3: ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని మండల అధ్యక్షుడు బానోత్ లాలు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడు తూ.. ప్రతి ఉద్యమకారుడికి 250 చదరపు గజాల ఇంటి స్థలంతోపాటు రూ.25వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సమ్మెట సమ్మయ్య, కార్యదర్శి ఉపేందర్, శ్రీపాల్, సో మయ్య పాల్గొన్నారు.

**ప్రకటన**

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **మరిపెడ బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపినస్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **నెర్సు సైదమ్మ** W/o: నెర్సు రవి, **వయస్సు:** 41సం||లు, వృత్తి : గృహిణి, **నివాసం:** ఇ.నెం. 1-45/1, చింతపల్లి గ్రామం, చింతపల్లి మండలం, మహబూబాబాద్ జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయిం చుకున్నారు. కావున సదరు వ్యవహార మునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 5 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియ జేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

<u>షెడ్యూలు ఆస్తి:</u> గ్రామ పంచాయితీ చింతపల్లి మండల పరిషత్, సీరోలు జిల్లా, జిల్లా పరిషత్ మహబూబాబాద్ జిల్లా రిజిస్ట్రార్ వరంగల్, సబ్ రిజిస్ట్రార్ మహబూబాబాద్ వారి పరిధిలో గల రెవిన్యూ గ్రామం చింతపల్లి గ్రామకంఠం పరిధిలోని చింతపల్లి గ్రామ పంచాయితీ ఇంటి నెం. 1-45/1, (Assesment No. 43) నకు సంబంధించిన RCC కప్పు గల గృహము నిర్మిత విస్తీర్ణము : 787.50 చ||ఫీట్ల గృహముతో, **డాక్యుమెంట్ : 5071/2025,** సహ ఖాళీ స్థల విస్తీర్ణము : 363.34 చ||గ||ల సమము : 303.79 చ||మీ||లు గల స్థిరాస్థినకు హద్దులు : **తూర్పు:** NH Road, **పడమర :** G.P. రోడ్డు, **ఉత్తరము :** నెర్సు శ్రీశైలం తండ్రి : లింగయ్య గారిస్థలము,**దక్షిణము:** గోండ్రు కేతమ్మ, భర్త : గంగమల్లు గారి గృహము.

**జి.హరేందర్ రెడ్డి**
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

## 14 జాతీయ లోక్ అదాలత్

మహబూబాబాద్ రూరల్, జూన్ 3 : జిల్లా కోర్టులో ఈ నెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మమద్ అబ్దుల్‌రఫీ అన్నారు. మంగళవారం జిల్లా కోర్టులో న్యాయవాదులు, జిల్లా పోలీసులతో కలిసి నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్, మనోవర్తి, భార్యాభర్తలు, సివిల్ కేసులు పరిష్కరించుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్, డీఎస్పీ తిరుపతిరావు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు

- విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచాలి
- సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి
- అధికారులతో సమీక్ష
- పాల్గొన్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు



జిల్లా అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్,జూన్ 3 : జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్‌తో కలిసి జిల్లా అధికారులతో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లకు కావాల్సిన ఇసుకను రీచ్‌ల ద్వారా అందించేందుకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కూపన్లు జారీ చేయాలన్నారు. ప్రస్తుతం వానకాల పరిస్థితుల దృష్ట్యా జిల్లాలో తగినన్ని ఎరువులు, విత్తనాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. నకిలీ విత్తన విక్రయాలు జరగకుం డా అధికారులు అప్రమత్తంగా ఉం డాలని ఆదేశించారు. రైతులకు ధా న్యంతోపాటు హార్టికల్చర్, ఇతర వాణి జ్య ఉద్యాన పంటలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో జేఎన్టీయూ, మెడికల్, డిగ్రీ కాలేజీ హార్టికల్చర్ యూనివర్సిటీలకుకేటాయించి స్థలాలను స్వాధీనం చేసుకోవాలన్నారు. అభివృద్ధి పనుల పు రోగతిపై తగిన ప్రణాళిక వెంటనే సి ద్ధం చేయాలన్నారు. జిల్లాను విద్యా హబ్‌గా తీర్చిదిద్దాలని, జిల్లా అభివృద్ధికి సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో ఇండోర్ స్టేడియం, బతుకమ్మ ఘాట్, ట్యాంక్ బండ్, రోడ్డు విస్తరణ పనులు, కూరగాయల మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకురావాలన్నారు.నూతనంగా ఏర్పడిన కేసముద్రం మున్సిపాలిటీకి నూతన భవనం, పాలిటెక్నికల్ కాలేజీ, ఎస్సీ కమ్యూనిటీహాల్, మినీ స్టేడియం, స్వాగత తోరణాలు డంపింగ్‌యార్డ్ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారి, అధికారులు పాల్గొన్నారు.

# భూ భారతితో సమస్యల పరిష్కారం

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్
- గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ప్రారంభం



వావిలాలలో రెవెన్యూ సదస్సును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: భూ సమస్యల పరిష్కారానికి గొప్ప వేదిక భూ భారతి నూతన చట్టమని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మంగళవారం ఆయన మహబూబాబాద్ మండలం సింగారం గ్రామంలో తహసీల్దార్ చంద్రరాజేశ్వర్ ఆధ్వర్యంలో , నెల్లికుదురు మండలంలోని వావిలాల గ్రామంలో తహసీల్దార్ నరేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను పరిశీలించి మాట్లాడారు. జిల్లాను రెవెన్యూ అధికారులను రెండు బృందాలు విభజించి ఉదయం, సాయంత్రం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో రైతుల కోసం ప్రత్యేక హెల్ప్‌డెస్క్ సిద్ధం చేయాలన్నారు. కురవి, సీరోలు మండలాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు మంగళవారం ప్రారంభమయ్యాయి. కురవి మండలం తిర్మలాపురం, జగ్యాతండా, మొగిలిచర్ల, సీరోలు మండల కేంద్రంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తిర్మలాపురంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ వీర బ్రహ్మాచారి పాల్గొన్నారు. గూడూరు మండలంలో మంగళవారం తొలి రోజులు నిర్వహించిన రెవెన్యూ సదస్సులు ప్రశాంతంగా జరిగాయి. తహసీల్దార్ నాగభవాని ఆధ్వర్యంలో భూపతిపేటలో, డిప్యూటీ తహసీల్దార్ కోమల ఆధ్వర్యంలో ఊట్ల గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. భూపతిపేటలో 129మంది, ఊట్ల గ్రామంలో 24 మంది రైతులు భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారు బయ్యారం మండలంలోని గురిమళ్ల, మిర్యాలపెంట గ్రామాల్లో భూ భారతి చట్టం అవగాహన సదస్సులు నిర్వహించారు. రైతులు తమ భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకుంటే పరిష్కరిస్తామని తాహసీల్దార్ నాగరాజు తెలిపారు. తొర్రూరు మండలంలోని గోపాలగిరి, కొమ్మనపల్లి గ్రామాల్లో మంగళవారం జరిగిన భూ భారతి అవగాహన సదస్సులను ఆర్డీవో గణేశ్ పరిశీలించారు. రైతులకు అవగాహన కల్పించారు. రెండు గ్రామాల నుంచి 67 ఫిర్యాదులు వచ్చినట్లు వెల్లడించారు. మరిపెడ మండలంలోని పురుషోత్తమయగూడెం, బుర్హాన్‌పురం గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తహసీల్దార్ కృష్ణవేణి తెలిపారు. రైతులను వినతులను స్వీకరించారు. పెద్దవంగర మండలంలోని పోచారం గ్రామంలో భూ సమస్యలపై రెవెన్యూ సదస్సును నిర్వహించినట్లు తహసీల్దార్ మహేందర్ తెలిపారు. చిన్నగూడూరు మండలం విస్సంపల్లి గ్రామంలో భూ భారతి చట్టంపై రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. డోర్నకల్ మండలంలోని గుర్రాలకుంటతండా, బూర్గుపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను మంగళవారం ఆర్డీవో కృష్ణవేణి పరిశీలించారు. రికార్డులు, భూ సమస్యల దరఖాస్తులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. భూ భారతి చట్టం ద్వారా 80శాతం భూ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్మానియేలు, డీటీ వీరన్న, ఆర్ఐ యాసిన్‌పాషా పాల్గొన్నారు.

**రెవెన్యూ సదస్సు వెలవెల**

గార్ల, జూన్ 3 : పెద్ద కిష్టాపురం, శేరిపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులు వెలవెలబోయాయి. రైతులు తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. ఏజెన్సీ మండలం కావడం.., గిరిజన రైతులకు తప్ప ఇతరులకు పట్టాలు కావని అధికారులు తెల్చిచెప్పడంతో రైతులెవరూ దరఖాస్తు చేసుకోలేదు. వారసత్వ పట్టాలు తప్ప మిగిలిన రైతులకు పట్టాలు కావని అధికారులు అంటున్నారు. కొందరు రైతుల నుంచి అసలు దరఖాస్తులు స్వీకరించలేదు.




పెద్దవంగరలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏడుస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

## పేదల సొంతింటి కలే ప్రభుత్వ లక్ష్యం

- పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి
- ఇండ్ల పట్టాలు, విత్తన పంపిణీలో భావోద్వేగానికి గురైన ఎమ్మెల్యే

పెద్దవంగర, జూన్ 3 : నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. మంగళవారం మం డల కేంద్రంలోని రైతువేదికలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లపట్టాలు, రైతులకు విత్తనాలు పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నిరుపేదకు న్యాయం చేస్తుందన్నారు. కాగా, రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఇండ్ల పట్టాలు.. విత్తన పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఒక్కసారిగా భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. పక్కనే కాంగ్రెస్ నాయకులు ఆమెను ఓదార్చారు. ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో అందరూ అవాక్కయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేణుమాధవ్, ఏవో స్వామి, విత్తన పరిశోధకులు అశ్విని, ఏఈవోలు రాజు, యశస్వినీ, విశ్వశాంతి, ఏఎంసీ డైరెక్టర్ పూర్ణచందర్, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

**తొర్రూరులో ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ..**

తొర్రూరు, జూన్ 3: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తొర్రూరు మండలంలో మొదటి విడతలో 603 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, ప్రస్తుతం 29 గ్రామపంచాయతీల్లో 163 ఇండ్ల పట్టాలను పంపిణీ చేశామన్నారు.

## పాకాల వాగులో గుర్తు తెలియని మృతదేహం

గూడూరు, జూన్ 3 : పాకాలవాగులో గుర్తు తెలియన మృతదేహం దొరికినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలోని కొల్లాపురం గ్రామ శివారు గంగదేవిపల్లి తండా సమీపంలోని పాకాలవాగులో మృతదేహం ఉన్నట్లు గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు వెళ్లగా నల్లని ప్యాంట్, గోధుమ కలర్ చొక్కా వేసుకున్న వ్యక్తి వాగులో మృతిచెంది ఉన్నట్లు గుర్తించామన్నారు.

## ఆర్గానిక్ కెమిస్ట్రీలో రమ్యచంద్రికాకు స్వర్ణపతకం

నర్సింహులపేట, జూన్ 3 : నర్సింహులపేట మండల కేంద్రానికి చెందిన ఈరగాని రమ్యచంద్రికాగౌడ్ హైదరాబాద్‌లో జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీలో ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ పూర్తి చేసి టాపర్‌గా నిలిచి బంగారు పతకం సాధించారు. మంగళవారం హైదరాబాద్‌లో గవర్నర్ చేతుల మీదగా పతకాన్ని అందుకున్న ఆమెను కుటుంబసభ్యులు, మండల ప్రజలు అభినందించారు.

## నల్లబెల్లం, పటిక స్వాధీనం

మహబూబాబాద్ రూరల్, జూన్ 3 : అక్రమంగా రవాణా చేస్తున్న నల్లబెల్లం, పటికను రూరల్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్సై దీపికారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని ఏఎస్సై సూరయ్య ఆధ్వర్యంలో ముడుపుగల్ గ్రామంలో పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో తాళ్లపూసపల్లి క్రాస్‌రోడ్ వద్ద ఓ కారులో వాంకుడోత్ సుమన్ అనే వ్యక్తి కారులో 40 కేజీల నల్లబెల్లం, 20 కేజీల పటికను తరలిస్తుండగా తనిఖీ చేసి నల్లబెల్లం, పటికను స్వాధీనం చేసుకుని సుమన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.




పెద్దవంగర బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న మండల నాయకులు ఐలయ్య, సంజయ్

## హామీలు అమలుచేయలేకే మొసలి కన్నీరు

**బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య, సంజయ్**

పెద్దవంగర, జూన్ 3 : ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయలేకనే మొసలి కన్నీరు కారుస్తున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఈదురి ఐలయ్య, శ్రీరాం సంజయ్ విమర్శించారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అమలు చేస్తామని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక చేపట్టకుండా పట్టాలు అందించడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించి నిజమైన లబ్ధిదారులను గుర్తించి పథకాలు అందించాలని కోరారు. నియోజకవర్గంలోని కొనుగోలు కేంద్రాల్లో ధన్యం తడిసి మొలకెత్తి రైతులు నానా ఇబ్బందులు పడుతుంటే ఓదార్చడానికి కూడా ప్రజాప్రతినిధులు రావడం లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు చనిపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రజాక్షేత్రంలోకి వెళ్లి నిజమైన లబ్ధిదారులను గుర్తించి పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుధీర్‌కుమార్, జ్ఞానేశ్వరాచారి, సమ్మయ్య, వీరన్నయాదవ్, రవి, విజయ, భిక్షపతి, సతీశ్, నవీన్, అనుదీప్ పాల్గొన్నారు.

## రైతులకు విత్తన కిట్ల పంపిణీ

మరిపెడ, జూన్ 3 : రైతులకు నాణ్యమైన వరి, పెసర విత్తనాల కిట్లను పంపిణీ చేసినట్లు మరిపెడ ఏడీఏ విజయచంద్ర అన్నారు. మంగళవారం మండలంలోని గిరిపురం గ్రామ పరిధిలోని రైతు వేదికలో మరిపెడ ఏవో వీరాసింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం వల్ల అధిక దిగబడికి వచ్చి రైతులకు ఆదాయం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కీటకాశాస్త్రం విభాగానికి చెందిన యువ శాస్త్రవేత వీరన్న, ఏఈవోలు పాల్గొన్నారు.

**మేలు రకం విత్తనాలు వాడాలి**

చిన్నగూడూరు : మేలు రకం విత్తనాలను వాడి రైతులు అధిక దిగుబడులు పొందాలని ఏవో భాస్కర్, కేవీకే మల్యాల శాస్త్రవేత్త కిశోర్‌కుమార్ సూచించారు. మండలంలోని ఉగ్గంపల్లి రైతువేదికలో జయశంకర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'నాణ్యమైన విత్తనం- రైతన్నకు నేస్తం' కార్యక్రమం ద్వారా వరి, పెసర వంగడాలను పంపిణీ చేశారు.

**కురవిలో ..**

కురవి, జూన్ 3 : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం క్వాలిటీ సీడ్ ఫర్ ఎవ్రీ విలేజ్ కార్యక్రమంలో భాగంగా రైతులకు నాణ్యమైన విత్తన సంచులను ఏవో నరసింహారావు అందజేశారు. డబ్ల్యూజీఎల్-44, డబ్ల్యూజీఎల్-1246, డబ్ల్యూజీఎల్-1355, ఎంజీజీ-385 రకాల మినీ కిట్లను రైతులకు రూ.50 చొప్పున ఆర్ఎఆర్ఎస్ వరంగల్ వ్యవసాయ శాఖ ద్వారా పంపిణీ చేశారు.

**నాణ్యమైన విత్తనాలతోనే లాభం**

బయ్యారం : నాణ్యమైన విత్తనాలతోనే రైతులకు లాభం చేకూరుతుందని ఏవో రాంజీనాయక్ అన్నారు. జయశంకర్ వ్యవసాయ వర్సిటీ వారు చేపట్టిన 'నాణ్యమైన విత్తనం – రైతన్నకు నేస్తం' అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం వ్యవసాయ పరిశోధనా స్థానాల ద్వారా ఉత్పత్తి చేయబడిన విత్తనాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు.

**సాగులో మెళకువలు పాటించాలి**

గంగారం, జూన్ 3: వానకాలం పంటల సాగులో రైతులు మెళకువలు పాటించాలని మండల ఏవో వేణుయాదవ్ రైతులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో రైతు వేదిక సెంటర్‌లో 'నాణ్యమైన విత్తనం-రైతన్న నేస్తం' అనే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నుంచి ఉచితంగా వచ్చిన వరి రకం డబ్ల్యూజీఎల్ -44, డబ్ల్యూజీఎల్ -1246, డబ్ల్యూజీల్-1355 రకాలను రైతులకు అందజేశారు.

## ఐటీఐలో దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ రూరల్, జూన్ 3 : ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో ఐటీఐ ప్రవేశాలకు అర్హత గల అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన అభ్యర్థులు ఈ నెల 21 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలని, మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. ఎంపిక అయిన వారికి సెల్ మెసేజ్ వస్తుందని పేర్కొన్నారు.

## సమ్మెను జయప్రదం చేయాలి

మహబూబాబాద్ రూరల్, జూన్ 3 : కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని వచ్చే 9న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కుంట ఉపేందర్ కోరారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా లేబర్ కోడ్‌లు తెచ్చి తీవ్రఇబ్బంది పెడుతున్నదని, కార్మికులను కట్టు బానిసలుగా చేసి హక్కులను హరిస్తున్నదన్నారు. కార్యక్రమంలో వీరన్న, రాజమౌళి, నాగన్న, మల్లయ్య, వెంకన్న పాల్గొన్నారు.

## సెక్యూరిటీ సర్వీసెస్‌పై చర్యలు తీసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, జూన్ 3 : ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో అవుట్ సోర్సింగ్ కార్మికులను దోపిడీ చేస్తున్న సాయి సెక్యూరిటీ సర్వీసెస్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఏరియా వైద్యశాల సూపరిండెంటెంట్ శ్రీనివాస్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యశాలలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన 150మంది కార్మికులు పని చేస్తున్నారని, వీరి నుంచి ప్రతి నెలా రూ.వెయ్యి జీతం కట్ చేసి దోచుకుంటున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు అర్హత లేని వారిని సైతం డబ్బులు తీసుకొని విధుల్లోకి తీసుకుంటున్నారని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే మనిషిగా చెప్పుకుంటూ ఒకరు వ్యవహారమంతా నడిపిస్తున్నారని, కలెక్టర్ స్పందించి విచారణ చేయిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు.

## ద్విచక్రవాహనం చోరీ

డోర్నకల్, జూన్ 3 : ద్విచక్రవాహనం చోరీ జరిగిన ఘటన డోర్నకల్‌లో మంగళవారం జరిగింది. పుల్లూరు గ్రామానికి చెందిన లింగాల రాజేశ్ మే 31న మధ్యాహ్నం డోర్నకల్ మెయిన్ రోడ్డు శ్రీవెంకటేశ్వర దంతావైద్యశాల వద్ద బైక్‌ను పార్కు చేశాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి వాహనాన్ని చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## విద్యార్థుల క్షేత్రస్థాయి ప్రదర్శన

గూడూరు, జూన్ 3 : ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణపై విద్యార్థులకు క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు గోపినాథ్ పాటిమీదతండాలోని విద్యార్థులు, యువతకు తన సొంత ఖర్చులతో విద్యార్థులను మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు తీసుకొచ్చి, వాటి నిర్వహణపై అవగాహన కల్పించారు. పోలీస్‌స్టేషన్, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, బ్యాంకు సేవలను ఆయా శాఖల అధికారులతో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గిరిధర్‌రెడ్డి, వైద్యులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలను అరికట్టాలని వినతి

కురవి, జూన్3 : నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలను అరికట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్ మాట్లాడుతూ.. రైతులందరికీ ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని, కొత్తగా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు సామ పాపయ్య, కోడి నర్సయ్య, మాలోత్ వీరన్న, వెంపటి సుధాకర్, పద్మ, లచ్చమ్మ, గణేశ్, వెంకన్న, భద్రకాళి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మరిపెడ, జూన్ 3 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన పురపాలక సంఘం పరిధిలోని శివాలయం వద్ద మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. దేశ్యతండాకు చెందిన భూక్యా జగన్, సంతోశ్ మండలంలోని అనేపురం రెవెన్యూ పరిధిలో ఇటుకల పాడుతండాకు వెళ్లి వస్తుండగా మరిపెడ శివాలయం వద్ద బైక్ హైవే ఎక్కుతుండగా, సూర్యాపేట నుంచి వస్తున్న బైక్ ఎదురెదురుగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో జగన్, సంతోష్ గాయాలుకాగా, స్థానికులు 108 వాహనంలో వారిని వైద్యశాలకు తరలించారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్తు ప్రవేశాలు

మరిపెడ, జూన్ 3 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్తు రెండో విడత అడ్మిషన్ల కోసం మంగళవారం పురపాలక సంఘం పరిధిలో ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం కలిసి పర్యటించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కలిసి కళాశాలలోని కోర్సుల వివరాలు, వసతులను వివరించారు. బీఎస్సీ, ఎంపీసీ, బికాం కంప్యూటర్ కోర్సులతోపాటు టైలరింగ్ నేర్పిస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు.

## సబ్సిడీపై విత్తనాలు అందించాలి

బయ్యారం : నాణ్యమైన విత్తనాలను రైతులకు సకాలంలో రాయితీపై అందజేయాలని ఏఐకేఎంఎస్ నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు, రామగిరి భిక్షం డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏఐకేఎంఎస్ నాయకులు మండల కేంద్రంలో ర్యాలీ, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఏటా నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతున్నారని, విధి లేక ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు తెలిపారు. నకిలీ విత్తనాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రభాకర్ పాల్గొన్నారు.


## ఎరువులు అందుబాటులో ఉంచాలి

గూడూరు, జూన్ 3 : రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు బండారు ఐలయ్య డిమాండ్ చేశారు. రైతు సమస్యలపై మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలతోపాటు ఎరువులను అందుబాటులో ఉంచాలని, కొత్త రుణాలను అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గజ్జి లింగన్న, అచ్చన్న, వెంకన్న, కొట్టెం సమన్న, వజ్జన్న, మల్లయ్య, సునీల్, ఎల్లయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

గార్ల, జూన్ 3 : చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం జరిగింది. ప్రొబేషనరీ ఎస్సై మైబూబి కథనం ప్రకారం.. మండలంలోని పుల్లూరు గ్రామ శివారు దేశ్యతండాకు చెందిన వినోద్‌కుమార్‌కు 4 సంవత్సరాల క్రితం కారేపల్లి మండలం గుడితండాకు చెందిన చిట్టెమ్మ(31)తో పెండ్లి జరిగింది. చిట్టెమ్మకు విపరీతమై కడుపు నొప్పితో రావడంతో పురుగుల మందు తాగింది. అల్లుడు వినోద్‌కుమార్ గమనించి ఖమ్మంలోని ఓ వైద్యశాలకు తీసుకెళ్లాడు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## విద్యుదాఘాతంతో మహిళ ..



ఓరుగంటి శైలజ(ఫైల్)

తొర్రూరు :విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందిన ఘటన తొర్రూ రు పట్టణంలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. వెలిశాల గ్రామానికి చెందిన ఓరుగంటి శైలజ (35), భర్త వీరస్వామి దంపతులు తొర్రూరు పట్టణం ఒక గదిని అద్దెకు తీసుకొని నివాసముంటున్నారు. మంగళవారం పక్కనే ఉన్న గంట సత్తమ్మ ఇంట్లో ఉన్న దండానికి శైలజ దుస్తులు ఆరేస్తుండగా షార్ట్ సర్క్యూట్ జరిగి అక్కడికక్కడే మృతిచెందింది. శైలజకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త వీరస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

**PLOT FOR SALE**

★Hnk గోపాలపూర్ భద్రకాళి కాలనీ రోడ్ నెంబర్ 2 లో ఈస్ట్ ఫేసింగ్ 300 స్క్వేర్ యార్డ్స్ 30 ఫీట్ల రోడ్డు మంచి వాస్తు క్లియర్ టైటిల్ గల ప్లాటు అమ్మబడును No Brokers cont : **8790501225** and **99499 12347**.
NTW-337079

**WATER PROOFING**

★శ్రీ వెంకటేశ్వర వాటర్ ప్రూఫింగ్ః వాటర్ లీకేజీ టెక్నిషియన్ నిర్ధారించి చేయబడును. ఓల్డ్ & న్యూ బిల్డింగ్ సొల్యూషన్స్- SS కన్స్ట్రక్షన్స్, Wgl.ప్రో, శ్రీకాంత్ 9014012652.
NTW-336940

**PLOTS FOR SALE**

★అల్ డెవలప్‌మెంట్ D.T.C.P లే-అవుట్, 1) వరంగల్, 2) ఘట్‌కేసర్, 3) బెంగుళూర్, 4) బొంబాయి, 5) విజయవాడ - HYD హైవేలలో తక్కువ ధరకు లభించును. సెల్: 9989552041, 7095401585
NTW-000

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565